క్లుప్తంగా

నేడు ఉచిత వైద్యశిబిరం

కంచికచర్ల: స్థానిక జుజ్జూరురోడ్డులోని స్వర సూపర్ స్పెషాలిటి పాలిక్లినిక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ఎం.అరవింద్ సూర్య గురువారం తెలిపారు. ఈశిబిరంలో బీపీ, షుగర్, పక్షవాతం, ఫిట్స్, తేలుకాటు, పాముకాటు, కిడ్నీ వ్యాధులు, దగ్గు, థైరాయిడ్ అస్తమా, నిమోనియా, నరాల వ్యాధులు, గుండె, పాయిజన్ కేసులు, విష జ్వరాలు సంబంధిత వ్యాధులకు వైద్యపరీక్షలు చేయనున్నట్లు వివరించారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జాతీయ ఉపకార వేతనానికి ఎంపిక



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న చందా అక్షయ జాతీయ ఉపకార వేతనానికి (ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు హెచ్ఎం అలవాల లక్ష్మి గురువారం తెలిపారు. నేషనల్ మినిట్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పేరుతో 8 వ తరగతి విద్యార్థులకు జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షలో ప్రతిభచూపిన చందా అక్షయకు తాను విద్యాభ్యాసం ఏటా రూ.15వేల చొప్పున కేంద్రప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందుతుందన్నారు. జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైన అక్షయను హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

క్షీరాభిషేకం



నందిగామటౌన్(నందిగామరూరల్): ఢిల్లీ సీఎంగా రేఖాగుప్తాకు అవకాశం కల్పించడం అభినందనీయమంటూ నందిగామ ఆర్యవైశ్య, ఆయా సంఘాల నాయకులు గురువారం హర్షం వ్యక్తంచేశారు. స్థానిక ముక్కోటి మహామండపం వద్ద ప్రధాని నరేంద్రమోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఆయా సంఘాల నాయకులు చవట నాగేశ్వరరావు, కేతేపల్లి సత్యంబాబు, పబ్బతి సీతారాంగుప్తా, ఊటుకూరు సత్యనారాయణ, పలువురు నాయకులు, వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు



నందిగామటౌన్(నందిగామరూరల్): విద్యా ప్రమాణాలు పెంచడంతోపాటు అంగన్‌వాడీ ప్రీస్కూల్ విద్యార్థులకు సులభతరంగా విద్యాబోధన చేసేందుకు ప్రభుత్వం శిక్షణా తరగతులను నిర్వహిస్తోందని డిస్ట్రిక్ట్ రిసోర్సు పర్సన్లు రాజ్యలక్ష్మి, మౌలాలి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్‌మేషన్స్ (సాల్ట్) పథకంపై అంగనవాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్ల కాలపరిమితిలో 120రోజుల ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో శిక్షణ పొందిన అంగనవాడీ వర్కర్లను అంగనవాడీ టీచర్స్‌గా ప్రభుత్వం ప్రమోట్ చేసి సర్టిఫికెట్లు అందజేస్తోందని వివరించారు. అనంతరం బోధనా పద్ధతులు, సంస్థాగత సామర్థ్యాలు, విద్యారంగంలో నాణ్యత పెంచడం తదితర అంశాలపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్లు వెంకట్రావమ్మ, శ్రీదేవి, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

28లోగా జీవన ధృవీకరణ పత్రాలు అందజేయాలి



కంచికచర్ల: ప్రభుత్వ పెన్షనర్లు ఈనెల 28వతేదీలోగా జీవన ధ్రువీకరణ సర్టిఫికెట్లను సబ్‌ట్రెజరీ కార్యాలయంలో సమర్పించాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ సంఘ అధ్యక్షుడు సానె రామ్మోహనరావు సూచించారు. లేనిపక్షంలో మార్చి నెల నుంచి ప్రభుత్వ పెన్షన్లు నిలిపి వేస్తారని వివరించారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో గురువారం కంచికచర్ల, వీరులపాడు మండలాల పెన్షనర్ల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య పరిస్థితి బాగోలేక మంచానికే పరిమితమైన పెన్షనర్లు ఆవివరాలను తెలియజేస్తే సబ్ ట్రెజరీ అధికారులే వారి ఇళ్లకు వెళ్లి జీవన ధృవీకరణ పత్రాన్ని సేకరిస్తారన్నారు. సమావేశంలో సంఘ కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు, ట్రెజరర్ సీహెచ్ నాగేశ్వరరావు, చాపలమడుగు స్వర్ణలత, షేక్ జానీమియా పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

జగ్గయ్యపేట: తెలంగాణ నుంచి ఏపీకి అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ గురవయ్య గురువారం తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రామశేషయ్య ఆధ్వర్యంలో మండలంలోని అన్నవరం గ్రామంలో ఆకస్మిక దాడులు చేశామని చెప్పారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన చెన్నూరి కనకమ్మ వద్ద 11మద్యం సీసాలు గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

నిఘా కళ్లు చూస్తున్నాయ్

- పల్లెలకూ విస్తరిస్తున్న సీసీ కెమెరా వ్యవస్థ
- భద్రత, నేరాల నియంత్రణలో కీలకం

పెనుగంచిప్రోలు: పట్టణాలతోపాటు పల్లెలకు కూడా సీసీ కెమెరాల ఏర్పాటు విధానం విస్తరిస్తోంది. ప్రముఖ ఆలయాలు, విద్యాసంస్థలు, బ్యాంక్‌లతోపాటు దుకాణాలు, ప్రధానకూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. గతంలో పట్టణాల్లో వ్యాపారసంస్థలకే పరిమితమైన సీసీ కెమెరాల వ్యవస్థ ఇప్పుడు అన్ని ప్రాంతాల్లో అవసరంగా మారింది. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర రోజురోజుకు కీలకంగా మారుతుండటం, ఆస్తుల సంరక్షణ, భద్రత అంశాలపై ప్రజల్లో పెరుగుతున్న అవగాహన కూడా సీసీ కెమెరాల ఏర్పాటులో కీలకంగా మారాయని చెప్పవచ్చు.

పటిష్ట భద్రతా చర్యల్లో భాగంగా..

పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపతమ్మ అమ్మవారి దేవాలయం వద్ద గతంలో 62 అధునాతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దీంతో ఆలయ నిర్వహణ అధికారులకు చాలా సులభతరమైంది. గ్రామంలోని బంగారం షాపులు, వ్యాపార సంస్థలు, పెట్రోల్ బంక్‌లో కూడా చోరీలు జరుగుతుండటంతో వాటి యాజమాన్యాలు సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకుంటున్నారు. చోరీలు, నేరాల నియంత్రణ కోసం ఆయా గ్రామాల్లో పలువురు తమ ఇళ్ల చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటున్నారు.

గ్రామాల్లో సీసీ కెమెరాలు..

పెనుగంచిప్రోలు పోలీసులు దాతలు, గ్రామస్తుల సహకారంతో మండలంలోని 15 గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో మొత్తం 10, పెనుగంచిప్రోలు ప్రధాన కూడళ్లలో 8 సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి. కెమెరాలకు అనుసంధానంగా పోలీస్‌స్టేషన్‌లో మానిటర్ ఏర్పాటు చేశారు. ఈ కెమెరాల్లోని దృశ్యాలు ఆ మానిటర్‌పై డిస్‌ప్లే అవుతుంటాయి. తద్వారా గ్రామంలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలు, చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు అవకాశం కలుగుతోంది. ట్రాఫిక్ ఇబ్బందులు, రోడ్డు ప్రమాదాలు తదితర సమయాల్లో పోలీసులు వేగవంతంగా పనిచేసేందుకు ఈ సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.



పెనుగంచిప్రోలు సెంటర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు



పెనుగంచిప్రోలు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల మానిటర్

నేరపరిశోధన మరింత సులువు..

మండలంలో అత్యంత సమస్యాత్మక గ్రామమైన నవాబుపేటలో గతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా ప్రస్తుతం అవి పనిచేయడం లేదు. దీంతో ఇప్పుడు నవాబుపేటతోపాటు అన్ని గ్రామాల్లో పోలీస్‌వారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కెమెరాల్లో రికార్డు అయిన పుటేజీని నెలరోజుల తరువాత కూడా చూసుకునే వీలుండటంతో నేర పరిశోధన, నిందితుల గుర్తింపులో పోలీసుల పనితీరు మరింత సులభతరంగా మారుతోంది. సీసీ కెమెరా వ్యవస్థతో అసాంఘిక కార్యక్రమాలు, నేరాలు చాలావరకు తగ్గుముఖం పడతాయని, వాటికి పాల్పడే వారికి సీసీ కెమెరాలు ఉన్నాయనే భయంతో ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. సురక్ష సభ్యుల ద్వారా పోలీసులు సీసీ కెమెరాల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నారు.

రూ.6లక్షలతో సీసీ కెమెరాలు...



విజయవాడ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకుగాను రూ.6 లక్షలకు ఖర్చవుతోంది. సురక్ష సభ్యుల ద్వారా ఇప్పటికే రూ.3 లక్షలు సమకూరాయి. మొదటగా పెనుగంచిప్రోలులో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రారంభించాం. మొత్తం మండలంలో 64 కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. వీటి ఏర్పాటుకు అందరూ సహకరించాలి. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల సంఖ్య తగ్గుతుంది.

– ఎంఎస్‌కే అర్జున్, ఎస్‌ఐ

ముస్తాబవుతున్న శివాలయాలు

వత్సవాయి: ఈనెల 26వతేదీన జరుగనున్న మహాశివరాత్రి పర్వదినానికి వత్సవాయి మండలంలోని శివాలయాలు ముస్తాబవుతున్నాయి. లింగాల మునేటి ఒడ్డున ఉన్న ఉమామహేశ్వర స్వామి, ఇందుగపల్లిలోని శ్రీపార్వతీ సమేత బాల కోటేశ్వరస్వామి, జాతీయ రహదారి పక్కనున్న కొంగరమల్లయ్య గట్టుపై వేంచేసియున్న కోనగిరి మల్లికార్జున స్వామి, వత్సవాయిలోని కాశీవిశేశ్వరస్వామి, మక్కపేటలోని శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయాలతో పాటు మంగొల్లు, కన్నెవీడు, పోలంపల్లి, కంభంపాడు, వత్సవాయి గ్రామాల్లోని శివాలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ పాలకవర్గాలు, అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోనున్నట్లు ఆలయాల మేనేజర్ హరిదుర్గానాగేశ్వరరావు తెలిపారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం ఆయా గ్రామాల్లో వేంచేసియున్న ఆలయాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని అర్చకులు అత్తలూరి యుగంధర్‌శర్మ తెలిపారు. శివరాత్రిరోజున శివకళ్యాణం నిర్వహిస్తామని వివరించారు.



విద్యుద్దీపాలంకరణలో లింగాల శివాలయం

అసాంఘిక కార్యకలాపాలు చేపడితే చర్యలు.

శివరాత్రి పర్వదినం సందర్భంగా గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని ఎస్‌ఐ పి ఉమామహేశ్వరరావు సూచించారు. రికార్డింగ్ డ్యాన్స్ వంటి కార్యక్రమాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు.

సీసీరోడ్డు నిర్మాణంలో నిబంధనలకు నీళ్లు

- టీడీపీ నాయకుల తీరుకు అధికారులు జీహుజూర్
- ఆగ్రహం వ్యక్తంచేస్తున్న జగన్నాథపురం వాసులు

జగన్నాధపురం(వీరులపాడు): ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లోని రోడ్లను సిమెంటురోడ్లుగా అభివృద్ధి చేసేందుకు వినియోగించాల్సిన నిధులను పంచాయతీ అధికారులు డొంకరోడ్డులో సీసీరోడ్డు నిర్మాణానికి వినియోగిస్తుండటం విమర్శలకు దారితీసింది. వివరాల్లోకి వెళితే .. వీరులపాడు మండలంలోని జగన్నాథపురంలో రూ.5లక్షలతో డొంకరోడ్డును సీసీరోడ్డుగా అభివృద్ధి చేస్తున్నారు. అధికార టీడీపీ నేతల ఒత్తిడికి తలొగ్గి అధికారులు సైతం ప్రజలను తక్కువగా వినియోగించే డొంకరోడ్డులో 300 మీటర్ల మేర సిమెంటురోడ్డు నిర్మాణం చేపట్టారు. గ్రామంలోని ఏదోఒక రోడ్డును సిమెంటురోడ్డుగా అభివృద్ధి చేస్తే గ్రామస్తులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. కాని పంచాయతీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా డొంక రోడ్డుకు సీసీ రోడ్డు వేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. గ్రామంలోని అనేక రోడ్లు అధ్వానంగా ఉన్నప్పటికీ పట్టించుకోని పంచాయతీ అధికారులు, టీడీపీ నేతల ఒత్తిడులకు తలొగ్గి డొంకరోడ్డును సిమెంటు రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఈ పనులను నాసిరకంగా చేపడుతుండటపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. డొంక రోడ్లను సిమెంటు రోడ్డుగా అభివృద్ధి చేయకూడదని నిబంధనలు చెబుతున్నా, శ్మశానవాటికను సాకుగా చూపి రోడ్డు వేస్తున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. శ్మశానవాటికకు వెళ్లే రోడ్డు మరొకటి ఉందని గ్రామస్తులు గుర్తుచేస్తునానరు. ఇకనైనా అధికారులు నిధులు దుర్వినియోగం చేయకుండా గ్రామస్తులందరికీ సౌకర్యంగా ఉండేలా గ్రామంలోని రోడ్లను సిమెంటురోడ్లుగా అభివృద్ధి చేయాలని జగన్నాథపురం వాసులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ రాజ్ ఏఈ రవికుమార్‌ను వివరణ కోరగా ఆరోడ్డులో శ్మశానవాటిక ఉండటంతో సీసీరోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు రహదారి నిర్మాణంలో భాగంగా చదును చేసి చిప్స్ తోలినట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలుపుదల చేశామని వివరించారు.



జగన్నాథపురంలో సీసీరోడ్డుగా అభివృద్ధి చేస్తున్న డొంక రోడ్డు

మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలి



రైతులు తెచ్చిన మిర్చిని పరిశీలించిన అనంతరం మాట్లాడుతున్న తన్నీరు

జగ్గయ్యపేటఅర్బన్: ఆరుగాలం రైతులు కష్టపడి పండించిన మిర్చిపంటకు ప్రభుత్వం క్వింటాకు రూ.20 వేల చొప్పున గిట్టుబాటు ధర కల్పించాలని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గే వైరస్ ఇతర చీడ పీడల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం ప్రకటించాలని కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గానికి చెందిన పలువురు మిర్చి రైతులు తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నామంటూ మిర్చిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా నెలరోజులుగా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. కానీ ఈ రోజు వరకు కూడా రాష్ట్ర ప్రభుత్వంలో ఎటువంటి చలనం లేకపోవడం బాధాకరమన్నారు. నష్టాల ఊబిలో కూరుకుపోయిన రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయడం గానీ, గిట్టుబాటు ధర కల్పించడం గానీ చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం వెంటనే మిర్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, మండల అధ్యక్షుడు బూడిద నరసింహారావు, పట్టణ మహిళా అధ్యక్షురాలు షేక్ మునీరాబేగం, జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య, జిల్లా కార్యదర్శి వేముల మల్లేశ్వరరావు, విజయవాడ కనకదుర్గ దేవస్థానం డైరెక్టర్ నంబూరి రవి, ఎస్టీసెల్ రాష్ట్ర నాయకుడు బద్దూనాయక్, మాజీ ఎంపీపీ పెంటి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గూడపాటి శేషగిరిరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు అన్నాబత్తుల శ్రీనివాసరావు తదితర నాయకులు, రైతులు పాల్గొన్నారు.

23నుంచి ముక్తేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న భవానీ ముక్తేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలు ఈనెల 23 నుంచి మార్చి 3వతేదీ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈవో సురేష్‌బాబు గురువారం తెలిపారు. 23న కృష్ణానది ఒడ్డునున్న ముక్తేశ్వరస్వామి వారి ఆలయంలో సంప్రోక్షణ, స్వామివారిని పెండ్లి కుమారుని చేయుట, 24న విఘ్నేశ్వర పూజ, అఖండస్థాపన, అంకురార్పణ, 25న నిత్యహోమం, బలిహరణ, ధ్వజారోహణ, 26న మహాశివరాత్రి సందర్భంగా శివదీక్ష మాల విరమణ, బిందెతీర్థం, వేదపారాయణ, బలిహరణ గ్రామసేవ, అమ్మవారికి కుంకుమార్చన, రాత్రి 12 గంటలకు స్వామివారి కళ్యాణోత్సవం, అన్నాభిషేకం కార్యక్రమాలు ఉంటాయన్నారు. 27వతేదీ నుంచి మార్చి 3వతేదీ వరకు పవళింపు సేవ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

పెండింగ్ బిల్లులు ఇవ్వాలని డిమాండ్

జుజ్జూరు(వీరులపాడు): మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులకు పెండింగ్ బిల్లులు మంజూరు చేయటంతోపాటు ప్రతినెలా బిల్లులు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కమల డిమాండ్ చేశారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో గురువారం మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథక ఏజెన్సీ నిర్వాహకుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులను తొలగిస్తున్నారన్నారు. ఏళ్ల తరబడి చేస్తున్న వారిని అకారణంగా తొలగించడం హేయమైన చర్యన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తొలగించిన నిర్వాహకులను తిరిగి తీసుకోవడంతోపాటు వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

200 మందికి వైద్యపరీక్షలు



బలుసుపాడు(జగ్గయ్యపేటఅర్బన్): గ్రామంలోని ఆర్‌సీఎస్ చర్చిలో జగ్గయ్యపేటకు చెందిన సెయింట్ ఆన్స్(అమెరికన్ హాస్పిటల్) వారి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ అక్ష వైద్యబృందం మొత్తం 200మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు సెయింట్ ఆన్స్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సిస్టర్ సుగంధి తెలిపారు. కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ సిస్టర్లు సునీత, సోషల్‌వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం


జగ్గయ్యపేటఅర్బన్: విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణను అలవరుచుకోవాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సూచించారు. పట్టణంలోని వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో జీఆర్‌సీ విద్యా సంస్థల ఇంటర్మీడియట్ విద్యార్థుల ఫేర్‌వెల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లు, వ్యసనాలకు లోనుకాకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. తద్వారా ఉన్నత స్థానాలకు చేరుకొని తల్లిదండ్రులకు, విద్యా సంస్థకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. సీఏ సీఎంలో ఆలిండియా 12 వ ర్యాంకు సాధించిన జీఆర్‌సీ పూర్వవిద్యార్థి నాగినిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జీఆర్‌సీ విద్యాసంస్థల చైర్మన్ రంగాపురం నరసింహారావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కరస్పాండెంట్ పెనుగొండ రాజీవ్, ప్రిన్సిపాల్ రమేష్, జీఆర్‌సీ అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థి నాగినిని సన్మానిస్తున్న పేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

హ్యాండ్‌బాల్ విజేతలకు అభినందన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషుల హ్యాండ్‌బాల్ పోటీల్లో తమ కళాశాల జట్టు ఛాంపియన్‌షిప్‌ను సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి తెలిపారు. ఇటీవల డాక్టర్ లక్కిరెడ్డి హనిమిరెడ్డి గవర్నమెంట్ డిగ్రీ కళాశాల (మైలవరం)లో టోర్నమెంట్ జరిగిందని పేర్కొన్నారు. అందులో తమ కళాశాల ప్రథమ స్థానంలో నిలిచి కప్‌ను సాధించారన్నారు. జట్టును గురువారం కళాశాలలో అభినందించారు. పి.తేజ, టి.శివనాగకార్తీక్, జె.సుభాష్, వి.అరవింద్‌బాబు, కె.సంగీత్‌కుమార్, పి.సాయితేజ, కె.చంద్రులతో కూడిన తమ కళాశాల జట్టు త్వరలో సేలం (తమిళనాడు)లోని పెరియార్ విశ్వవిద్యాలయంలో జరుగబోయే దక్షిణ భారతస్థాయి విశ్వవిద్యాలయాల పురుషుల హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైందన్నారు. వీరంతా కృష్ణా విశ్వవిద్యాలయానికి ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ టి.శ్రీనివాస్ క్రీడాకారులను అభినందించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హిందూ హైస్కూల్స్ కమిటీ ఏవో డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.రామకృష్ణ, పీజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో కేబీఎన్ యాజమాన్యం

మంచు పరదాలు



ఫిబ్రవరి మూడోవారంలోనూ మంచు దుప్పట్లు కనువిందు చేస్తున్నాయి. తెల్లవారుజాము నుంచి ఉదయం ఏడు గంటల వరకు నందిగామ గ్రామీణ ప్రాంతాలను మంచు వీడటం లేదు. గ్రామీణ ప్రాంత డొంక రోడ్లు, పచ్చని పంట పొలాలపై గ్రామాల్లోని ఇళ్లు, చెట్ల నడుమన విద్యుత్ లైట్ల వెలుగుల్లో మంచు తెరలు దర్శనమిస్తున్నారు. ఉదయం ఏడు గంటల వరకు మంచు కురుస్తుండటంతో ఆయా పనులపై బయటకు వెళ్లేవారు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నప్పటికీ పర్యావరణ ప్రేమికులు మాత్రం ఆహ్లాదభరిత వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు.

– నందిగామరూరల్





బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): మహిళల స్వయం ఉపాధికి మెప్మా, ఎన్‌ఎస్‌డీసీ సంయుక్త ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పూజిత మహిళ సొసైటీ అధ్యక్షురాలు ఎర్రబోతుల కోటేశ్వరి పేర్కొన్నారు. గురువారం కృష్ణలంకలోని బాలాజీనగర్, రాణిగారి తోటలో ఉచిత శిక్షణ కేంద్రంలో తరగతులు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా యూసీడీ పీఓ వెంకటనారాయణ పాల్గొని తరగతులను ప్రారంభించి బ్యూటీషియన్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరి మాట్లాడుతూ ఈ నెల 20నుంచి మార్చి 3వ తేదీ వరకు సుమారు 200 మందికి నాలుగు బ్యాచ్‌లుగా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణ పూర్తయిన వెంటనే అసెస్‌మెంట్ నిర్వహించి ఎన్‌ఎస్‌డీసీ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు ఇవ్వడంతో పాటు హోం ట్రయాంగిల్ యాప్‌లో ఆన్ బోర్డు చేసి ఉపాధి కల్పించామన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ టెక్నికల్ ఎక్స్‌పర్ట్ సుజాత, సీడీవో ఉమామహేశ్వరి, సీఓలు, ఆర్పీలు పాల్గొన్నారు.

త్రిశక్తి పీఠం హుండీ ఆదాయం రూ.12.68లక్షలు



కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీ మాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో హుండీ కానుకలు లెక్కించగా రూ.12,68,839 ఆదాయం వచ్చిందని ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జి.పుల్లయ్య, కె.జగదీష్‌కుమార్ అన్నారు. దేవస్థానం ఆవరణంలోని 12 హుండీ కానుకలు గురువారం లెక్కించారు. భక్తుల సమక్షంలో ఇన్‌స్పెక్టర్ ఎ.సుజన్ పర్యవేక్షణలో కమిటీ సభ్యులు 150 రోజులకు ఆలయంలోని 12 హుండీలు తెరిచి అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ ఆధ్యాత్మిక సలహాదారుడు బీహెచ్ విజయకిరణ్, కమిటీ సభ్యులు ఎం.రాజా, టి.మల్లేశ్వరరావు, ఎ.జగన్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ

జగ్గయ్యపేటఅర్బన్: నియోజకవర్గానికి చెందిన ఐదుగురు దివ్యాంగులకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) గురువారం నివాసంలో ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. గద్దం త్రివేణి(బూదవాడ), మురికిపూడి సాత్విక్ (రామచంద్రాపురం), బలంతు వెంకట్రావు(మల్కాపురం), గాలి ఆదిలక్ష్మి(మంగొల్లు), సొంపొంగు కనకరత్నం(కంభంపాడు)లకు ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సైకిళ్లు మంజూరు కావడానికి కృషి చేసిన దివ్యాంగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వడ్డెపూడి ఉమామహేశ్వరరావును ఎమ్మెల్యే తాతయ్య అభినందించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి గోనె విజయలక్ష్మి, ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు, సింగం వీర్రాజు పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య